

ఢిల్లీ, జైపూర్‌లో భూకంపం

ఆందోళనలో తెలుగు విద్యార్థులు

ప్రజాశక్తి - ఉంగుటూరు

దేశ రాజధాని ఢిల్లీలో మంగళవారం భూకంపం సంభవించడం జిల్లాలోని పలు కుటుంబాల్లో ఆందోళన నెలకొంది. భూకంప ప్రకంపనలు అటు నేపాల్‌తోపాటు ఢిల్లీ, జైపూర్ పరిసర ప్రాంతాలకు తాకినట్లు సమాచారం. రాజస్థాన్‌లోని జైపూర్‌లో నిమ్స్ యూనివర్సిటీలో మెడిసిన్ చదువుతున్న విద్యార్థులు భయాందోళనతో తరగతి గదుల నుంచి పరుగులు తీస్తూ బయటకి వచ్చినట్లు ఉంగుటూరు మండలం నారాయణపురానికి చెందిన మెడిసిన్ విద్యార్థి ఇక్కడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దీంతో ఢిల్లీ, జైపూర్‌లో ఉన్న తమ వారి క్షేమసమాచారం కోసం పలువురు ఫోన్లు చేయడం కన్పించింది.

హమాలీ ఛార్జీలేవీ..!



రబీ ధాన్యానికి సంబంధించి ఇప్పటికీ రాని హమాలీ ఛార్జీలు

క్వింటాకు రూ.25 చొప్పున రావాల్సి ఉన్నా పట్టించుకోని అధికారులు

గత ఖరీఫ్‌లోనూ పలువురు రైతులకు అందని హమాలీ సొమ్ము

బాధితుల్లో అత్యధికం కౌలురైతులే

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ధాన్యం పండించే రైతుల గోడు ప్రభుత్వానికి, అధికారులకు పట్టడం లేదు. ధాన్యం కొనుగోలులో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు ప్రభుత్వం ప్రకటించిన హమాలీ ఛార్జీలు సైతం ఇప్పటికీ అందని దుస్థితి నెలకొంది. రైతుభరోసా కేంద్రాల చుట్టూ రైతులు కాళ్లరిగేలా తిరుగుతున్నా పట్టించుకునే నాథుడే లేకుండాపోయాడు. ఏలూరు జిల్లాలో హమాలీ సొమ్ము అందని బాధిత రైతులు అత్యధికంగా ఉన్నట్లు క్షేత్రస్థాయి పరిస్థితులు చెబుతున్నాయి. గడిచిన రబీలో ఏలూరు జిల్లావ్యాప్తంగా 2.16 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేశారు. 31,999 మంది రైతుల నుంచి రూ.442 కోట్లు విలువైన ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి ప్రభుత్వం నూతన విధానాన్ని ప్రవేశపెట్టింది. ఇది రైతులకు పెనుశాపంగా మారింది. లారీలు, సంచులు దొరక్కపోవడం, మిల్లర్లకు అదనపు సొమ్ము చెల్లించాల్సి రావడం వంటి సమస్యలు అన్నదాతను తీవ్రంగా వేధిస్తున్నాయి. దీంతో రైతులే వాహనాలను మాట్లాడుకుని ధాన్యం తరలిస్తున్నారు. లారీ కిరాయి సొమ్ము, ధాన్యం పట్టే జట్టుకు సంబంధించి హమాలీల సొమ్మును రైతులకు చెల్లిస్తామని ప్రభుత్వం చెప్పింది. క్వింటాకు రూ.25 చొప్పున హమాలీ సొమ్ము చెల్లించనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. క్షేత్రస్థాయిలో హమాలీ ఛార్జీలు క్వింటా ధాన్యం పట్టేందుకు రూ.30, రూ.35 వరకూ ఖర్చవుతోంది. అయినప్పటికీ ఎంతోకొంత వస్తుందిలే అని రైతులు సర్దుకుంటున్నారు. ఆ సొమ్ము సైతం సరిగా రైతులకు ఇవ్వని దుస్థితి నెలకొంది. గడిచిన రబీ ధాన్యానికి సంబంధించిన హమాలీల సొమ్ము ఇప్పటికీ అందకపోవడంతో రైతులు అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. బాధిత రైతుల్లో అత్యధికం కౌలురైతులే ఉన్నారు. రవాణా ఛార్జీలు కూడా జమ కాలేదని పలువురు రైతులు చెబుతున్నారు. గడిచిన ఏడాది ఖరీఫ్‌లోనూ చాలామంది రైతులకు హమాలీ ఛార్జీలు అందని పరిస్థితి ఉంది. ప్రతిరైతుకూ న్యాయం చేస్తామని ప్రభుత్వం చెబుతున్న మాటలకు, క్షేత్రస్థాయిలో పరిస్థితులకు సంబంధం లేకుండాపోయింది. ప్రభుత్వం నుంచి హమాలీ ఛార్జీలు అందకపోవడంతో రైతులే తమ సొంత సొమ్ము హమాలీలకు చెల్లించాల్సి వచ్చింది. దీంతో రైతుల నెత్తిపై మరో అదనపు భారం పడినట్లయ్యింది. హమాలీ ఛార్జీలపై పౌర సరఫరాల శాఖ ఏలూరు జిల్లా మేనేజర్ మంజుభార్గవిని వివరణ కోరేందుకు ఫోన్‌లో ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

హమాలీ ఛార్జీలు రూ.8 వేలు రావాలి

బైరెడ్డి లక్ష్మణరావు, సుంకరవారితోట, వరిరైతు

రబీలో పదెకరాలకు సంబంధించిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాం. దాదాపు రూ.ఎనిమిది వేల వరకూ హమాలీ ఛార్జీలు రావాలి. ఇప్పటి వరకూ బ్యాంకు ఖాతాలో జమ కాలేదు. రైతుభరోసా కేంద్రాల్లోని అధికారుల వద్దకు వెళ్తే వచ్చేస్తాయని చెప్పడం తప్ప ఇప్పటికీ రాలేదు. దీంతో చేతి సొమ్ము హమాలీలకు చెల్లించాల్సి వచ్చింది. ఇప్పటికైనా హమాలీ ఛార్జీల సొమ్ము జమ చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం.

40 ఎకరాల ధాన్యానికి హమాలీ ఛార్జీలు జమ కాలేదు

సున్నా వెంకట్రావు, ఉండ్రాజవరం, దెందులూరు మండలం

రబీలో 40 ఎకరాల్లో వరిసాగు చేశాను. దాదాపు నాలుగు వేల సార్ల ధాన్యం విక్రయించాం. సారకు హమాలీ ఛార్జీ కింద రూ.15కు పైగా ఖర్చయ్యింది. ప్రభుత్వం సారకు రూ.పది చొప్పున ఇస్తామని చెప్పింది. ఈ సొమ్ము సైతం ఇప్పటి వరకూ రాలేదు. గడిచిన ఖరీఫ్ సీజన్‌లోనూ హమాలీ ఛార్జీలు అందలేదు. హమాలీ ఛార్జీలు అందేవిధంగా చూడాలని కోరుతున్నాం.

హమాలీ ఛార్జీల బకాయిలు వెంటనే చెల్లించాలి

కె.శ్రీనివాస్, ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి

గడిచిన ఖరీఫ్, రబీలకు సంబంధించి అనేక మంది రైతులకు ఇప్పటికీ హమాలీ ఛార్జీలు అందలేదు. ఈ సొమ్ము కోసం చాలామంది రైతులు ఎదురుచూస్తున్నారు. ఏ రైతు పేరు మీద ధాన్యం విక్రయించారో ఆ రైతు ఖాతాల్లో పడతాయని చెబుతున్నారేగానీ జమ కావడం లేదు. దీనికి సంబంధించిన సమాచారం ఆర్‌బికెల్లోనూ చెప్పడం లేదు. పలుచోట్ల రవాణా ఛార్జీల సమస్య కూడా ఉంది. వెంటనే బకాయిలను చెల్లించకపోతే రైతులతో కలిసి ఆందోళన చేపడతాం.

మోడీ మూల్యం చెల్లించక తప్పదు

సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల ఆధ్వర్యాన నిరసనలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్



ఏలూరులో నిరసన తెలుపుతున్న నేతలు

కేంద్రంలోని మోడీ ప్రభుత్వ రైతాంగ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ, ఉత్తరప్రదేశ్ లోని లఖింపూర్ ఖేరిలో శాంతియుతంగా ర్యాలీ చేస్తున్న రైతులపై కేంద్ర సహాయ మంత్రి అజయ్ మిశ్రా కుమారుడు, బిజెపి గూండాలు సాగించిన హత్యాకాండను ఖండిస్తూ సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం), కేంద్ర కార్మిక సంఘాల సమన్వయ కమిటీ పిలుపులో భాగంగా బ్లాక్ డే పాటిస్తూ మంగళవారం స్థానిక పాత బస్టాండ్ సెంటర్‌లోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. మోడీ ప్రభుత్వం రైతాంగ, కార్మిక వ్యతిరేక విధానాలు నశించాలి.. మద్దతు ధరల గ్యారెంటీ చట్టం తేవాలి.. కేంద్ర విద్యుత్ సవరణ బిల్లు రద్దు చేయాలి.. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలంటూ నినదించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్, ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు యు.వెంకటేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు, బికెఎంయు జిల్లా అధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా నాయకులు రాజనాల రామ్మోహన్‌రావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్, ఎఐటియుసి జిల్లా నాయకులు కె.కృష్ణమాచార్యులు, ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా కన్వీనర్ రాయంకుల లక్ష్మణరావు, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ మాట్లాడారు. ఇప్పటికైనా లఖింపూర్ ఖేరి హత్యాకాండకు కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని, అజయ్ మిశ్రాను కేంద్ర మంత్రి పదవి నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. ఢిల్లీ రైతాంగ ఉద్యమం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం లిఖితపూర్వకంగా ఇచ్చిన హమీలను అమలు చేయకుండా రైతాంగాన్ని మోసగించిందన్నారు. మద్దతు ధరల గ్యారెంటీ చట్టాన్ని తీసుకొస్తామని చెప్పి ఒక కమిటీని ఏర్పాటు చేసి చేతులు దులుపుకుందన్నారు. రైతులు కష్టపడి పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక అన్నదాతలు అల్లాడిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రుణ విమోచన చట్టాన్నితెచ్చి రైతాంగాన్ని ఆత్మహత్యల నుండి రక్షిస్తామని వట్టి మాటలు చెప్పారన్నారు. విద్యుత్ చట్ట సవరణ బిల్లులో వ్యవసాయరంగాన్ని మినహాయిస్తామని హామీ ఇచ్చి వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగించేలా కేంద్ర విద్యుత్ సవరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టడం దుర్మార్గమన్నారు. రైతు ఉద్యమ సందర్భంగా పెట్టిన కేసులను రద్దు చేస్తామని హామీలు ఇచ్చారని గుర్తు చేశారు. ఏఒక్క హామీని అమలు చేయకుండా మరోవైపు దొడ్డిదారిన రద్దు చేసిన వ్యవసాయచట్టాలను తిరిగి పునరుద్ధరించే పద్ధతుల్లో, కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేసే విధంగా అనేక ప్రయత్నాలను మోడీ ప్రభుత్వం చేస్తోందన్నారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణ ఆపాలన్నారు. గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పట్టణ ప్రాంతాలకు విస్తరింపజేయాలని కోరారు. మోడీ ప్రభుత్వ రైతాంగ, కార్మిక వ్యతిరేక విధానాలను కార్మిక, కర్షక ఐక్యతతో తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు కె.విజయలక్ష్మి, వి.సాయిబాబా, కడుపు కన్నయ్య, పి.అదిశేషు, యర్రా శ్రీనివాస్, పుప్పాల కన్నబాబు, ఆర్‌ఎస్ డాంగే, జి.రాంబాబు, డి.వీరినాయుడు, లంకా రామ్మోహన్, జె.గోపీ, బి.జగన్నాథం, మావూరి శ్రీనివాసరావు, దండిబోయిన చంద్రశేఖర్ పాల్గొన్నారు.

చింతలపూడి: ఎస్‌కెఎం, కార్మిక సంఘాల పిలుపు మేరకు ప్రభుత్వ జూనియర్ కళాశాల నుండి ఫైర్ స్టేషన్ సెంటర్ వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. ఫైర్ స్టేషన్‌లో దొంత కృష్ణ అధ్యక్షతన నిరసన నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్‌విఎస్.నారాయణ, ఎఐకెఎస్ జిల్లా కార్యదర్శి డి.రంగనాథ్, ఎపి రైతుసంఘం మండల అధ్యక్షులు ఎస్‌కె.కాలేషా, ఎఐటియుసి జిల్లా కోకన్వీనర్ తొర్లపాటి బాబు మాట్లాడారు. కార్యక్రమంలో నేతలు నత్త వెంకటేశ్వరరావు, ఎస్.సూర్యకుమార్, కంచర్ల గురవయ్య, బి.సత్యనారాయణ, ఎస్‌కె.జానీ, తాడిగడప మాణిక్యాలరావు, అప్పారావు, రమేష్, శ్రీను, ప్రసాద్ పాల్గొన్నారు.



చింతలపూడిలో నిరసన తెలుపుతున్న నేతలు

నిడమర్రు: రైతుసంఘం, సిఐటియు ఆధ్వర్యంలో అడవికొలను, భువనపల్లి గ్రామాల్లో నిరసన తెలిపారు. రైతు సంఘం నాయకులు లావేటి సోంబాబు అధ్యక్షతన జరిగిన బ్లాక్ డే ధర్నాలో కోన శ్రీనివాసరావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నారపల్లి రమణారావు మాట్లాడారు. ధర్నాలో రైతులు కానూరు రాజు, వెలగలేటి మోహన్, గుడిసే మహంకాళి, సంకు మురళీకృష్ణ, కందులపాటి పేరంటాలు, దుత్తాడు శ్రీను, ముత్యాలు చిన్న, కలిసేటి నరసింహ, వంటాకుల విష్ణు, రొంగల శ్రీను పాల్గొన్నారు.

కొల్లేరు ఇఎస్‌జెడ్ సరిహద్దులకు సమగ్ర ప్రతిపాదనలు

అధికారులకు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ దిశానిర్దేశం

ప్రజాశక్తి - ఏలూరు



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

కొల్లేరు వన్యప్రాణుల అభయారణ్యం కోసం ఎకో సెన్సిటివ్ జోన్ (ఇఎస్‌జెడ్) సరిహద్దుల నిర్ధారణ కోసం సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేసేందుకు కార్యాచరణ రూపొందించేందుకు సంబంధిత శాఖలవారీ నివేదికలను సమర్పించాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎకో సెన్సిటివ్ జోన్‌కు ప్రతిపాదనలు సిద్ధం చేసేందుకు నియామకమైన కమిటీ తొలి సమావేశం కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఇఎస్‌జెడ్‌కు సంబంధించి పరిగణనలోకి తీసుకోవాల్సిన వివిధ అంశాలను వన్యప్రాణి విభాగం డిఎఫ్‌ఒ ఎస్.రవిశంకర్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇఎస్ జెడ్ సరిహద్దుల ప్రాథమిక లక్ష్యం కొల్లేరు వన్యప్రాణుల అభయారణ్యం చుట్టూ కొన్ని కార్యకలాపాను నియంత్రించడం, తద్వారా రక్షిత ప్రాంతాన్ని ఆవరించి ఉన్న పర్యావరణ వ్యవస్థ కార్యకలాపాల ప్రతికూల ప్రభావాలను తగ్గించడమన్నారు. వన్యప్రాణి విభాగం డిఎఫ్‌ఒ కోరిన విధంగా ఆయా లైన్ డిపార్ట్‌మెంట్స్ నిర్ధేశిత సమాచారాన్ని అందించి సహకరించాలన్నారు. ఈ కార్యక్రమం అత్యంత ప్రాధాన్యతతో కూడిందని ఆయన స్పష్టం చేశారు. కొల్లేరులోని వెట్‌ల్యాండ్, వన్యప్రాణుల అభయారణ్యానికి సంబంధించి ఎకో సెన్సిటివ్ బఫర్ జోన్ నిర్ధారించే ముందు సంబంధిత గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. దీనికి సంబంధిత శాఖల సమన్వయంతో మండల కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. దీనికి ఏలూరు ఆర్‌డిఒ కోఆర్డినేటర్‌గా వ్యవహరిస్తారన్నారు. గ్రామసభలు నిర్వహించేందుకు 14 రోజుల ముందు నోటీసులు జారీ చేయడంతోపాటు ఆ గ్రామంలో ఏ తేదీన నిర్వహించేది నోటీసు ప్రదర్శించాలన్నారు. సంబంధిత గ్రామాలు గుర్తించి గ్రామ సభల షెడ్యూలును రూపొందించాలన్నారు. గ్రామసభ నిర్వహణకు ఎస్‌ఒపి తయారు చేసుకోవాలన్నారు. గ్రామ సభలో వచ్చే సలహాలు, అభ్యంతరాలను స్వీకరించాలన్నారు. వీటన్నింటితోపాటు సంబంధిత శాఖల అధికారులు సమర్పించిన నివేదికలతో తదుపరి సమావేశంలో సమీక్షించి తుది ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. విజయవాడ నుంచి వచ్చే బుడమేరు కొల్లేరులో కలిసే మార్గంలో ఎక్కడైతే డ్రెయిన్ తక్కువ వెడల్పు ఉంటుందో ఆ ప్రాంతాన్ని గుర్తించి అక్కడ క్రస్ట్‌లు ఏర్పాటు చేసి చెత్తను రోజువారీ తొలగించే ఏర్పాటుకు ఆలోచన చేయాలన్నారు. ఆ ప్రాంతంలో రెండు, మూడు ఎకరాల విస్తీర్ణం ఉండే భూములు గుర్తించి అక్కడ చెత్తను విభజించే ప్రక్రియను చేపట్టి ప్రత్యేక యూనిట్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో టెరిటోరియల్ డిఎఫ్‌ఒ రవీందర్ ధామ, వన్యప్రాణుల విభాగం డిఎఫ్‌ఒ ఎస్.రవిశంకర్, ఏలూరు ఆర్‌డిఒ ఎన్ఎస్‌కె.ఖాజావలీ, ఇరిగేషన్ ఎస్ఇ కె.శ్రీనివాసరావు, ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ పి.సాల్మన్‌రాజు, కాలుష్య నియంత్రణ మండలి ఇఇ వెంకటేశ్వరరావు, జిల్లా పరిశ్రమల కేంద్రం జిఎం పి.ఏసుదాసు, మత్స్యశాఖ ఇన్‌ఛార్జి జెడి జివివి.సత్యనారాయణ, డివిజనల్ పంచాయతీ అధికారి చంద్రశేఖర్, నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్.వెంకటకృష్ణ, ఆర్అండ్‌బి ఎస్ఇ జి.జాన్‌మోషే, వ్యవసాయ శాఖ జెడి వై.రామకృష్ణ, పశుసంవర్ధక శాఖ డిడి టి.సత్యగోవింద్ పాల్గొన్నారు.

కార్మిక హక్కులపై ప్రభుత్వ దాడిని తిప్పికొట్టాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్



పిహెచ్‌సి వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కార్మిక నేతలు

ప్రపంచవ్యాప్తంగా కార్మికుల హక్కులపై ప్రభుత్వాల దాడిని తిప్పికొట్టాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. డబ్ల్యుఎఫ్‌టియు (ప్రపంచ కార్మిక సంఘాల సమాఖ్య) వ్యవస్థాపక దినోత్సవ సందర్భంగా మంగళవారం సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక చాటపర్రు రోడ్‌లోని పిహెచ్‌సి వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి ప్రసాద్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల్లో ప్రభుత్వాలు, యాజమాన్యాలు కార్మికులను ఇష్టానుసారం దోచుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఫలితంగా ప్రపంచంలో అసమానతలు పెరుగుతున్నాయన్నారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం రెండవసారి అధికారంలోకి వచ్చాక కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్లుగా తీసుకువచ్చిందన్నారు. దీంతో కార్మికవర్గం తమ హక్కులను నష్టపోతోందన్నారు. రాష్ట్రంలో అప్రకటిత ఎమర్జెన్సీ నడుస్తోందని, కార్మికులు తమ హక్కుల కోసం ప్రజాస్వామ్య యుతంగా నిరసన తెలియజేసేందుకు కూడా ప్రభుత్వం అంగీకరించడం లేదని, అక్రమ అరెస్టులకు, వేధింపులకు పాల్పడుతోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కె.విజయలక్ష్మి, వి.సాయిబాబు, జె.గోపి, బి.జగన్నాథం, లోకేశ్వరి గీత, నవ్య, బేగం తదితరులు పాల్గొన్నారు.

చేబ్రోలు జగనన్న కాలనీ లేఅవుట్ల పరిశీలన

5.93 ఎకరాల్లో 259 ప్లాటులు

181 మంది ఇళ్ల నిర్మాణం

ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు

ప్రజాశక్తి - ఉంగుటూరు

చేబ్రోలులో జగనన్న కాలనీ లేఅవుట్‌ను కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మంగళవారం సాయంత్రం పరిశీలించారు. 5.93 ఎకరాల్లో 259 ప్లాటులు వేశారు. అందులో 181 మంది ఇళ్లు నిర్మించుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జగనన్న ఇళ్లను సిఎం ఒకే రోజున వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. జిల్లాలో చేబ్రోలు కాలనీ లేఅవుట్‌ను అధికారులు ఎంపిక చేశారు. జిల్లా అధికారులంతా ప్రారంభోత్సవానికి రానున్నారు. దీంతో ప్రారంభోత్సవం సందర్భంగా కాలనీలో జరిగిన, జరుగుతున్న పనులను పరిశీలించేందుకు ఎంఎల్‌ఎ పుప్పాల వాసుబాబుతో కలసి కలెక్టర్ వచ్చారు. ప్రారంభోత్సవం తేదీ ఇంకా ఖరారు కాలేదు. 6వ తేదీ కాని 9న కాని ప్రారంభోత్సవం ఉంటుందనే భావిస్తున్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు, ప్రజలతో బహిరంగ సభ ఎక్కడ నిర్వహించాలి, శిలా ఫలకం ఏర్పాటు ఎక్కడ చేయాలి, వీధులు, రోడ్డు నిర్మాణాలు ఎంతవరకు వచ్చాయో పరిశీలించారు. అనంతరం అధికారులకు కలెక్టర్ పలు ఆదేశాలు ఇచ్చారు. ఆయన వెంట ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, అధికార పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



లే అవుట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్



దీక్షా శిబిరంలో నినదిస్తున్న సాబ్జీ, సోమయ్య, స్వీపర్లు

స్కూల్ స్వీపర్ల వేతనాలు చెల్లించాలి

దీక్షలను ప్రారంభించిన ఎంఎల్‌సి సాబ్జీ

ప్రజాశక్తి - ఏలూరు

మున్సిపల్ స్కూల్ స్వీపర్లకు ఇచ్చే అరకొర వేతనాలు కూడా 5 మాసాలుగా చెల్లించకపోవడం దారుణమని ఉభయగోదావరి జిల్లాల టీచర్స్ ఎంఎల్‌సి షేక్ సాబ్జీ తెలిపారు. మున్సిపల్ స్కూల్ స్వీపర్లు 5 నెలల బకాయి జీతాలు విడుదల చేయాలని మంగళవారం ఏలూరు డిఇఒ కార్యాలయం ముందు చేపట్టిన రిలే నిరాహార దీక్షా శిబిరాన్ని ఎంఎల్‌సి మెడలో ఎర్ర రిబ్బన్లు వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సాబ్జీ మాట్లాడుతూ రోజుకి రూ.133 అతి తక్కువ వేతనంతో పనిచేసే ఉద్యోగులు వీరు మాత్రమేనని, దేశంలో ఎవరు ఇంత అతి తక్కువ వేతనాలతో పనిచేసే వారు లేరని, ఇంత తక్కువ వేతనాలు కూడా సకాలంలో చెల్లించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని తెలిపారు. మున్సిపల్ పాఠశాలలను విద్యాశాఖలో విలీనం చేసి 15 మాసాలు అవుతున్నా స్కూళ్లలో పనిచేసే స్వీపర్ల జీతాల విషయం తేల్చకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనం కాదా? అని ఆయన ప్రశ్నించారు. స్కూల్స్ స్వీపర్ల బకాయి జీతాలు చెల్లించే వరకు వారి ఆందోళనకు మద్దతుగా ఉంటానని, అధికారులు, మంత్రులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.సోమయ్య మాట్లాడుతూ స్కూల్ స్వీపర్లు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు రోజుకు 10 గంటల పాటు పని చేసినా వారికి ఇవ్వాల్సిన జీతాలు సకాలంలో చెల్లించకుండా దారుణమాన్నారు. తక్షణమే వారి బకాయి జీతాలు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ దీక్షల కార్యక్రమానికి స్కూల్ స్వీపర్ల యూనియన్ నగర అధ్యక్షురాలు జె.స్వాతి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో కృష్ణవేణి, విజయలక్ష్మి, నాగమణి, పద్మజ, జగలక్ష్మి, లక్ష్మీ ప్రియాంక పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేయాలి : కలెక్టర్

గ్రూప్-4 అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేత

ప్రజాశక్తి - ఏలూరు

విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తూ ప్రజలు, ఉన్నతాధికారుల మెప్పుపొందాలని గ్రూప్-4లో ఉద్యోగాలు పొందిన అభ్యర్థులకు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. ఎపిపిఎస్‌సి 2021లో జారీ చేసిన నోటిఫికేషన్ ద్వారా ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా రెవెన్యూ శాఖలో గ్రూప్-4 జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ అసిస్టెంట్ ఉద్యోగాలకు ఎంపికైన 48 మందిలో 45 మందికి మంగళవారం కలెక్టరేట్‌లో ఆయన నియామక ఉత్తర్వులు అందించారు. ఎంపికైన వారిలో 19 మంది ఏలూరు జిల్లాకు, 20 మంది పశ్చిమ గోదావరి జిల్లాకు, మరో 9 మంది తూర్పుగోదావరి జిల్లాకు కేటాయించబడ్డారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు ఆశించినంత స్థాయిలో ప్రభుత్వ సేవలను మెరుగ్గా అందించేలా ఉద్యోగులు బాధ్యతగా విధులు నిర్వర్తించాలన్నారు. నూతనంగా ప్రభుత్వ ఉద్యోగాలు పొందిన వారు సర్వీస్ ప్రారంభం నుంచే ప్రజలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి, అర్జీలను సానుకూల ధృక్పథంతో పరిశీలించి, ప్రభుత్వ సేవలు అందేలా పనిచేయాలన్నారు. ముఖ్యంగా రెవెన్యూ శాఖతో అధిక శాతం మంది ప్రజలకు నిత్యం పనులు ఉంటాయని, సాధ్యమైనంత వరకు మీ పరిధిలో ఉన్న అంశాలను సత్వరమే పరిష్కరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఎఒ రమాదేవి, సిబ్బంది, నూతనంగా ఉద్యోగాలు పొందిన అభ్యర్థులు పాల్గొన్నారు.

వ్యాధుల నియంత్రణకు చర్యలు చేపట్టాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ప్రజాశక్తి - ఏలూరు

రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా పేదలకు సత్వర వైద్యసేవలు అందిస్తామని పత్రికల్లో, మీడియాలో ప్రచారం చేసుకోవడమే కాకుండా, జిల్లాలో ప్రబలుతున్న వైరల్ జ్వరాలు, సీజనల్ వ్యాధులకు యుద్ధ ప్రతిపాదకన చర్యలు చేపట్టాలని సిపిఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి రాష్ట్ర ప్రభుత్వాన్ని, జిల్లా వైద్య ఆరోగ్య శాఖను డిమాండ్ చేశారు. జిల్లాలో ఒక పక్క గోదావరి పరివాహక ప్రాంతం, మరో పక్క కొల్లేరు, విచ్చలవిడిగా తవ్వుతున్న చేపలు, రొయ్యల చెరువులు, వీటిని మించి రోడ్లు, డ్రైన్ల వ్యవస్థను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. నీరు ఎక్కడికక్కడ నిల్వ ఉండిపోయి విపరీతమైన దోమలు పెరిగి పోతున్నాయని, వాతావరణంలో వస్తున్న మార్పులను బట్టి జిల్లాలో ఎక్కడ చూసినా సీజనల్ వ్యాధులు, వైరల్ జ్వరాలు పెరిగిపోతున్నాయని తెలిపారు. మరీ ముఖ్యంగా గిరిజన ప్రాంతమైన ఏజెన్సీలో మలేరియా, టైఫాయిడ్, వైరల్ జ్వరాలతో జనం అలాడిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సరైన రోడ్డు, రవాణా సౌకర్యాలు లేక, సమయానికి వైద్యం అందక, ఒక్కొక్క సారి ప్రాణాలు సైతం కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రోడ్లు మరమత్తులు చేసి, నీరు నిల్వ లేకుండా తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో, ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతంలో మరింత ఎక్కువగా మెడికల్ క్యాంపులు నిర్వహించాలని, అవసరమగు మందులు, వైద్య సిబ్బందిని, డాక్టర్లను ఏర్పాటు చేసి తక్షణమే ప్రజలకి వైద్య సేవలందించాలని కోరారు.

బిజెపి ఓటమితోనే దేశానికి మేలు : సిపిఎం

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

బిజెపి ఓటమితో ఈ దేశానికి మేలు చేకూరుతుందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం తెలిపారు. సిపిఎం శాఖ కార్యదర్శుల శిక్షణ తరగతులను రెండో రోజు మండలంలోని జైనవారిగూడెంలో నిర్వహించారు. పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు మేడియం నాగమణి ప్రిన్సిపల్‌గా వ్యవహరించారు. రెండో రోజు సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం కలకత్తా తీర్మానం, 23వ జాతీయ మహాసభల నివేదిక అంశాలపై క్లాసును బోధించారు. దేశంలో బిజెపి ఈ తొమ్మిదేళ్ల పరిపాలనలో నిరుద్యోగం, ధరల పెరుగుదల నియంత్రించలేకపోయిందని విమర్శించారు. అనంతరం పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈనెల 30, 31 తేదీలలో రాష్ట్ర బస్సు యాత్ర పోలవరం నియోజకవర్గంకు వస్తున్నదని, నవంబర్‌లో విజయవాడలో నిర్వహించే భారీ బహిరంగ సభకు ఈప్రాంత ప్రజలంతా కదలి రావాలని ఆయన పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు తెల్లం రామకృష్ణ, జిల్లా కమిటీ సభ్యులు తామ ముత్యాలమ్మ, మండల కార్యదర్శులు తెల్లం దుర్గారావు, యం.జీవరత్నం, శుక్లబోయిన రాంబాబు పాల్గొన్నారు.

శిక్షణ తరగతులను వినియోగించుకోవాలి

భీమడోలు: ఈనెల 12, 13వ తేదీల్లో ఏలూరులో నిర్వహించే ఏపి రైతు సంఘం జిల్లాస్థాయి శిక్షణ తరగతులను వినియోగించుకోవాలని ఏపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ కోరారు. భీమడోలులోని ప్రజా సంఘాల కార్యాలయంలో పలువురు రైతు ప్రముఖులతో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. అనంతరం శిక్షణ తరగతుల కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతాంగ సమస్యలపై రైతులకు అవగాహన కల్పించేందుకు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సదస్సుకు జిల్లా పరిధిలోని 150 మంది రైతు ప్రతినిధులు హాజరుకానున్నారని తెలిపారు. ముఖ్యఅతిథిగా ఏపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య, అతిథిగా ఉపాధ్యక్షులు వై.కేశవరావు హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమంలో ఏపి రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కట్ట భాస్కరరావు పాల్గొన్నారు.

బర్మా సీతారామయ్యను అభినందించిన ఎంఎల్ఎ

ముసునూరు: నియోజకవర్గ స్థాయిలో ఉత్తమ రైతు అవార్డు బర్మాసీతారామయ్యకు రావడం అభినందనీయమని నూజివీడు నియోజకవర్గ ఎంఎల్ఏ మేకా వెంకటప్రతాప్ అప్పారావు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ అక్కిరెడ్డిగూడెం చెందిన బర్మాసీతారామయ్యకు నియోజకవర్గ స్థాయిలో ఉత్తమ రైతు అవార్డు రావడం, ఆయన గతంలో ఎంపిటిసిగా గెలిచి గ్రామానికి ఎన్నో సేవలు అందించారని ఎంఎల్ఎ కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు ముల్పూరి నాగవల్లేశ్వరరావు, వైస్ ఎంపిపి కోటగిరి రాజానాయన, సర్పంచి పులిబల్ల లక్ష్మి సత్యనారాయణ, ఎంపిటిసి పుచ్చకాయ వెంకటేశ్వరరావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

పూలే ఆశయ సాధనకు కృషి

ఏలూరు అర్బన్: అంటరానితనం, కుల వివక్షకు వ్యతిరేకంగా, స్త్రీ పురుష సమానత్వానికై పోరాడిన జ్యోతిబాపూలే, సావిత్రిబాయి పూలేల ఆశయ సాధనకై ముందుకు సాగాలని సిపిఐ(ఎంఎల్) న్యూడెమొక్రసీ జిల్లా అధికార ప్రతినిధి యు.వెంకటేశ్వరరావు, జిల్లా నాయకులు బద్దా వెంకట్రావు పిలుపునిచ్చారు. కుల రహిత సమాజ సాధనకై జ్యోతిబాపూలే సత్యశోధక సమాజ్ స్థాపించి 151 సంవత్సరాలైన సందర్భంగా మంగళవారం ఏలూరులోని జూట్‌మిల్లు సెంటర్, ఓవర్ బ్రిడ్జి సమీపంలోని పూలే దంపతుల విగ్రహాల వద్ద కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 150 సంవత్సరాల క్రితమే కుల కట్టుబాట్లు, అణిచివేత, అంటరానితనం, వివక్షతలకు వ్యతిరేకంగా పోరాడిన జ్యోతిబాపూలే ఆదర్శప్రాయుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎంఎల్) న్యూడెమొక్రసీ, ఐఎఫ్‌టియు నాయకులు ఎర్రా శ్రీనివాసరావు, గద్దాల రాంబాబు, మంగం బుల్లబ్బాయి పాల్గొన్నారు.

నేడు రామాంజనేయులు సంస్మరణ సభ

ఏలూరు: ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు, కీర్తిశేషులు పోలా రామాంజనేయులు(71) సంస్మరణ సభ ఈనెల 4వ తేదీ ఉదయం 9 గంటలకు ఏలూరు రూరల్ శనివారపుపేట వీవర్స్ కాలనీలో నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా కార్యదర్శి పిచ్చుక ఆదిశేషు మంగళవారం విలేకరులకు తెలిపారు. పోలా రామాంజనేయులు అనంతపురం జిల్లా ధర్మవరం పట్టణంలో చేనేత కార్మిక ఉద్యమాన్ని నిర్మించారు. సంస్మరణ కార్యక్రమానికి ఏలూరు శనివారం పేట దొండపాడు గ్రామాల నుంచి చేనేత కార్మికులు, చేనేత ఉద్యమ శ్రేయోభిలాషులు పాల్గొని జయప్రదం చేయవలసిందిగా ఆదిశేషు కోరారు.

దాతల సహకారం అభినందనీయం

భీమడోలు: వికలాంగుల సంక్షేమానికి తాము చేస్తున్న కృషికి దాతల సహకారం అభినందనీయమని గుండుగొలను కేంద్రంగా పనిచేసే శ్రీవిఘ్నేశ్వర వికలాంగుల సేవా సమితి నిర్వాహకులు తెలిపారు. సేవా సమితి ఆధ్వర్యంలో గ్రామ పరిధిలోని సుమారు 50 మంది వికలాంగులకు ప్రతినెల వారికి అవసరమైన బియ్యం, నిత్యావసర వస్తువులు, పండ్లు, ఇతర పౌష్టికాహారాలు అందజేస్తున్నారు. ఇదే క్రమంలో వారి ఆరోగ్య పరిరక్షణకు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి వారికి వైద్యసేవలను అందిస్తున్నారు. ఇందుకూరి సోమేశ్వర రాజు అనే దాత తమ కుటుంబ సభ్యుల ఇందుకూరి వెంకటరామరాజు, ఇతర కుటుంబ సభ్యుల సంస్మరణార్థం సేవా సమితి ద్వారా వికలాంగులకు భోజనం, ఇతరాలను మంగళవారం అందజేశారు. విఘ్నేశ్వర వికలాంగుల సేవా సమితి పాలకవర్గ సభ్యులు గుండుగొలనులోని తమ కార్యాలయంలో దాతలను సత్కరించారు.

అంబేద్కర్ గురుకుల కళాశాలలో క్రీడా పోటీలు

జంగారెడ్డిగూడెం: స్థానిక అంబేద్కర్ గురుకుల కళాశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి అండర్-19 క్రీడా పోటీలలో ఎంపికైన క్రీడాకారులు రాష్ట్ర స్థాయి అండర్-19 క్రీడలలో పాల్గొంటారని జిల్లా ఫిజికల్ డైరెక్టర్ కె.జయరాజ్ తెలిపారు. మంగళవారం అంబేద్కర్ గురుకుల కళాశాలలో ప్రిన్సిపల్ ఎస్.భారతి, వైస్ ప్రిన్సిపల్ కె.అరుణ ఆధ్వర్యంలో అండర్-19 క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో జిల్లా ఫిజికల్ డైరెక్టర్ కె.జయరాజ్, ఇతర కళాశాల పిడిలు, పాల్గొని క్రీడాకారుల పోటీలు నిర్వహించారు. ఎంపికైన క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో నిర్వహించు అండర్ 19 విభాగంలో పాల్గొంటారని తెలిపారు.

వారాహి యాత్ర విజయవంతం చేయాలి

ముదినేపల్లి: మండలకేంద్రమైన ముదినేపల్లిలో ఈనెల 5వ తేదీన జరిగే నాలుగవ విడత జనసేనాని వారాహి యాత్ర జనసేన, టిడిపి నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని ముదినేపల్లి మండల జనసేన పార్టీ అధ్యక్షులు వీరంకి వెంకయ్య కోరారు.

ఎపిఎంలకు సమీక్షా సమావేశం

ముదినేపల్లి: ముదినేపల్లిలోని క్రాంతి మండల మహిళా సమాఖ్య కార్యాలయం నందు మంగళవారం నియోజకవర్గ స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నాలుగు మండలాలకు చెందిన ఎపిఎంలు, సీసీలు, క్లస్టర్ స్థాయి సమావేశం అన్ని క్లస్టర్లకు చెందిన మీద అధికారులు సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా స్థాయి అధికారులు డిపిఎం బిఎల్, డిపిఎంబిఐ, డిపిఎం ఫైనాన్స్, డిపిఎంఎల్‌హెచ్, డిపిఎం చేయూతలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

నాయుడుగూడెంలో గడప గడపకూ మన ప్రభుత్వం

ఏలూరు టౌన్: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా దెందులూరు ఎంఎల్ఎ కొఠారు అబ్బయ్య చౌదరి పెదపాడు మండలం నాయుడుగూడెం సచివాలయం పరిధిలోని ప్రతి గడపకు వెళ్లి జగనన్న ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు, చేస్తున్న అభివృద్ధి గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి చైర్మన్, ఎంపిపి, సర్పంచ్, ఇతర ప్రజా ప్రతినిధులు, సొసైటీ అధ్యక్షులు, పార్టీ జిల్లా నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

పరీక్షలకు పటిష్టమైన భద్రతా చర్యలు

ఏలూరు స్పోర్ట్స్: ఏపి పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు చేపడుతోన్న సబ్ ఇన్స్‌పెక్టర్ ఆఫ్ పోలీస్(ఎస్ఐ) పోస్టుల నియామకంలో తుది దశ పరీక్షలకు రంగం సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే రెండు దశల్లో పరీక్షలు పూర్తి చేసి ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులను తుదిదశకు ఎంపిక చేశారు. ఈ నేపథ్యంలో ఈనెల 14, 15 తేదీల్లో ఆఖరి రాత పరీక్షకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఏలూరు రేంజ్ డిఐజి జివిజి అశోక్ కుమార్ ఏలూరు నగరంలోని పలు కళాశాలలను పరిశీలించారు. పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు మధ్య రాత పరీక్షలను చేపట్టేందుకు పోలీస్ ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ పరీక్ష కేంద్రాల తనిఖీలో జిల్లా ఎస్‌పి డి.మేరీ ప్రశాంతి, డిఎస్‌పి ఇ.శ్రీనివాసులు ఉన్నారు.

ప్రతిఒక్కరూ వైద్య సేవలు వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

రాష్ట్రంలో ఉన్న పేద ప్రజల పట్ల ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి ఉన్న అభిమానమే జగనన్న ఆరోగ్య సురక్ష పథకానికి పునాదైందని నగరపాలక సంస్థ మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా స్థానిక తంగెళ్లమూడి అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన మెగా మెడికల్ క్యాంపుకు మేయర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.



హెల్త్ సెంటర్‌లో కిట్లను అందిస్తున్న మేయర్ నూర్జహాన్

భీమడోలు: భీమడోలు గ్రామ సచివాలయం-1 పరిధిలో మంగళవారం నిర్వహించిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమం క్యాంపును ఉంగుటూరు ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు ప్రారంభించారు. సర్పంచి పి.సునీత మాన్సింగ్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంఎల్ఎ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏలూరు ఆర్‌డిఒ ఎన్ఎస్‌కె.ఖాజావలి, జెడ్‌పిటిసి తుమ్మగుంట భవాని రంగా, ఎంపిపి కనుమాల రామయ్య, ఎఎంసి ఛైర్‌పర్సన్ ఇంజేటి నీలిమ జూనియర్ పాల్గొన్నారు.

నూజివీడు రూరల్ : పట్టణంలోని కోనేరు పేటలో ఉన్న పట్టణ పిహెచ్‌సిలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని మంగళవారం ఎంఎల్ఎ మేక వెంకట ప్రతాప్ అప్పారావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఒ దయ్యాల ఆశ, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ముసునూరు : ప్రతి పేదవాడికి మెరుగైన వైద్యం అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని నూజివీడు ఎంఎల్ఎ మేకా వెంకటప్రతాప్ అప్పారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రాపర్ల కృష్ణకుమారి, వైస్ ఎంపిపి కోటగిరి రాజానాయన, సర్పంచి పులిబల్ల లక్ష్మిసత్యనారాయణ, ఎంపిటిసి వెంకటేశ్వరరావు, ఎంపిడిఒ జి.రాణీ, నూజివీడు సబ్‌కలెక్టర్ ఆదర్శ్‌రాజేంద్రన్, వైద్యులు యం.కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

టి.నర్సాపురం : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు వినియోగించుకోవాలని ఎంపిపి డి.లక్ష్మి కోరారు. మండలంలోని కేతవరం వైఎస్ఆర్ విలేజ్ క్లినిక్ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణ నందు మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం సర్పంచి తడికలపూడి శివమాధవి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి దారబోయిన లక్ష్మి, సర్పంచి తడికలపూడి శివ మాధవి, డిఎల్‌పిఒ ఎండి రజాఉల్లా, ఎంపిడిఒ మంగా కుమారి, మండల వైద్యాధికారులు డా.ఫణీంద్ర బాబు, డా.ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

జీలుగుమిల్లి : మండలంలోని పి.రాజవరం పంచాయతీలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో మండల ప్రత్యేక అధికారి పివిఎస్.నాయుడు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కోర్స పోసమ్మ, జెడ్‌పిటిసి మల్లం వసంతరావు, సర్పంచి సోయం కాంతమ్మ, వైస్ ఎంపిపి ఎస్.శ్రీనివాస్, మండల అధ్యక్షులు సందా ప్రసాద్, ఎంపిడిఒ కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

ఉంగుటూరు : వెల్లమిల్లి పంచాయతీ పరిధి చినవెల్లమిల్లిలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్షా సర్వేలో గుర్తించిన వారికి మెడికల్ క్యాంపు నిర్వహించారు. కాగుపాడు, చేబ్రోలు పిహెచ్‌సి వైద్యాధికారులతో పాటు ఏలూరు ప్రభుత్వాసుపత్రి నుంచి స్పెషలిస్టులు వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేశారు. సర్పంచి వస్కా కుమార్ రాజా, పంచాయతీ, సచివాలయం, ఆరోగ్య సిబ్బంది సేవలందించారు.

మండవల్లి : మండలంలోని భైరవపట్నంలో మంగళవారం నిర్వహించిన జగనన్న సురక్షలో ఎంఎల్ఎ దూలం నాగేశ్వరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యురాలు ముంగర విజయనిర్మల, మండల పార్టీ అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, సర్పంచి నీలపాల లీలా నాగేంద్ర పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : అనారోగ్య సమస్యతో బాధపడుతున్న వారు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా వైద్య సేవలను పొందాలని వైసిపి పట్టణ అధ్యక్షులు చిటికెల అచ్యుతరామయ్య తెలిపారు. స్థానిక 6 వ వార్డులో నిర్వహించే జగనన్న ఆరోగ్య సురక్షను చింతలపూడి ఎంఎల్ఎ ఉన్నమట్ల ఎలిజా ప్రారంభించినట్లు తెలిపారు. ఆయనతో పాటు మున్సిపల్ ఛైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి పాల్గొంటారని తెలిపారు

కలిదిండి : మండలంలోని కొచ్చర్ల గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ఆరోగ్య సురక్షలో ఎంఎల్ఎ దూలం నాగేశ్వరావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి చందన ఉమామహేశ్వరరావు, జెడ్‌పిటిసి బొర్రా సత్యవతి, వైస్ ఎంపిపిలు కనకదుర్గా రాణి, నాగలక్ష్మి, ఎఎంసి ఉపాధ్యక్షులు పాము రవికుమార్, సర్పంచులు ఆళ్ళ రాము పాల్గొన్నారు.

పోలవరం : గూటాల గ్రామపంచాయతీ పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఎ పిఒ టి.సూర్య తేజ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పోలవరం ఎంపిపి సుంకర వెంకట రెడ్డి, ఎంపిడిఒ జి.శ్రీను పాల్గొన్నారు.

పాల ఉత్పత్తిదారుల సంక్షేమానికి కృషి

మండవల్లి : పాల ఉత్పత్తిదారుల సంక్షేమానికి కృష్ణామిల్క్ యూనియన్ అనేక సంక్షేమ కార్యక్రమాలు ప్రవేశపెట్టిందని కృష్ణా పాల ఉత్పత్తిదారుల యూనియన్ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు స్పష్టం చేశారు. లింగాల పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సంఘాను మంగళవారం ఆయన సందర్శించి పాల ఉత్పత్తిదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాల ఉత్పత్తిదారులకు ప్రతి నాలుగు మాసాలకు 10 శాతం చొప్పున ధర వ్యత్యాసం (బోనస్) పంపిణీ చేస్తున్నామన్నారు. అంతేకాకుండా క్షీర బంధు, కళ్యాణమస్తు ప్రతిభ వంటి పథకాలతో పాటు పశువులకు ఉచితంగా పశు వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గుడ్లవల్లేరు పాలసీతలీకరణ కేంద్రం మేనేజర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

మానవత ఆధ్వర్యంలో పలు ప్రోత్సాహకాలు

ప్రజాశక్తి - భీమడోలు

స్వచ్ఛంద సంస్థ మానవత భీమడోలు శాఖ గాంధీ జయంతి పురస్కరించుకొని మండల పరిధిలో మంగళవారం పలు ప్రోత్సాహక, సంక్షేమ కార్యక్రమాలను చేపట్టారని శాఖ ఛైర్మన్ జి.నూకరాజు తెలిపారు. ఈక్రమంలో రూ.58 వేల నగదును, రెండు కుటుంబాల వారికి నిత్యావసర వస్తువులు, బియ్యం, దుస్తులను అందజేశారన్నారు. దీనిలో భాగంగా పేదరికంతో చదువుకునేందుకు ఇబ్బంది పడుతున్న ముగ్గురు విద్యార్థులకు(ఒకరు బిఎస్‌సి నర్సింగ్, ఒకరు ఇంజినీరింగ్, ఒకరు పాలిటెక్నిక్) వారి ప్రతిభ ఆధారంగా ఒక్కొక్కరికి రూ.15 వేలు వంతున సహాయాన్ని అందజేశారు. ఈ మొత్తాలను శాఖకు చెందిన జిల్లా కార్యవర్గ, శాఖ సభ్యులు ముగ్గురు సమకూర్చారు. ఇదే క్రమంలో అనారోగ్య కారణంగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఒక విలేఖరికి సంస్థ తరపున రూ.5 వేలు, సభ్యులు తరపున రూ.3 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. సేవా కార్యక్రమాల్లో భాగంగా ఎంఎం పురంలో అనారోగ్యం కారణంగా వైద్యానికి ఇబ్బంది పడుతున్న ఒక వ్యక్తి కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఇదేవిధంగా పూళ్ళ గ్రామంలో వృద్ధాప్యం కారణంగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఒక కుటుంబానికి భీమడోలుకు చెందిన శ్రీసాయిరాం క్లాత్ స్టోర్ వారి సౌజన్యంతో నిత్యావసర వస్తువులు, బియ్యం, దుస్తులు అందించారు. ఈ కార్యక్రమంలో శాఖ అధ్యక్షులు వట్టి సుగుణాకర్, జిల్లా కార్యవర్గ సభ్యులు అప్పక రాంబాబు, పాల్గొన్నారు.

'ఓటమి భయంతోనే చంద్రబాబు అరెస్టు'

ప్రజాశక్తి - చాట్రాయి

ఓటమి భయంతోనే వైసిపి ప్రతిపక్ష నాయకుడి అరెస్టు చేయించి, ప్రజల దృష్టిని మరల్చేందుకు చూస్తున్నారని నూజివీడు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి, మాజీ ఎంఎల్ఎ ముద్దరబోయిన వెంకటేశ్వరరావు తెలిపారు. చాట్రాయి మండలం, జనార్థనవరంలో మంగళవారం బాబుతో నేను కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మరడి చిట్టిబాబు, ప్రధాన కార్యదర్శి పలగాని దుర్గారావు, ఏలూరు పార్లమెంట్ తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నూజివీడు రూరల్ : చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ మండలంలోని పాత రావిచర్ల గ్రామంలో మంగళవారం టిడిపి నాయకత్వంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. టిడిపి శ్రేణులకు మాజీ ఎంఎల్ఎ, టిడిపి ఇన్‌ఛార్జి ముద్రబోయిన వెంకటేశ్వరరావు సంఘీభావం తెలిపారు. చంద్రబాబు జైలు నుంచి విడుదల అయ్యేంత వరకు ఈ ఆందోళన జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ముసునూరు: చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసనగా 21వ రోజు మంగళవారం మండల కేంద్రమైన ముసునూరు మండపం సెంటర్ వద్ద రిలే నిరాహార దీక్షలో భాగంగా బాబుతో నేను అనే వినతి పత్రాలను మహిళలకు అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర తెలుగు యువత ఆర్గనైజింగ్ సెక్రటరీ గద్దె రఘుబాబు మాట్లాడుతూ ఎటువంటి తప్పు చేయని చంద్రబాబుని అక్రమంగా అరెస్టు చేయటం అన్యాయమన్నారు. ఈ కార్యక్రమంలో కొల్లి గంగరామ్, మందలపు ధర్మరాజు, మెదరమెట్ల సురేంద్ర, లక్క పాము కాంతారావు, పర్వతనేని వెంకటేశ్వరరావు, చలమాల వెంకటేశ్వరరావు, గార్లపాటి నరసింహారావు, కందుల పిచ్చయ్య, కాటేపల్లి సత్యనారాయణ, కాటేపల్లి ప్రసాదు, తల్లిబోయిన సత్యనారాయణ పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : చంద్రబాబునాయుడుపై అక్రమ కేసులను ఎత్తివేయాలని టిడిపి శ్రేణులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. మంగళవార టిడిపి పట్టణ ఉపాధ్యక్షులు కొండ్రెడ్డి కిషోర్ అధ్యక్షతన దీక్ష శిబిరం 22వ రోజుకు చేరుకుంది. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు రావూరి కృష్ణ, పరిమి సత్తిపండు, పట్టణ ప్రధాన కార్యదర్శి తూటికుంటరాము పాల్గొన్నారు.

కళాకారుల గుర్తింపుకార్డులకు దరఖాస్తుల స్వీకరణ

డిపిఆర్‌ఒ ఆర్‌విఎస్.రామచంద్రరావు

ప్రజాశక్తి - ఏలూరు

సాంస్కృతిక కళాకారుల నూతన గుర్తింపు కార్డుల జారీ నిమిత్తం ఏలూరు జిల్లాలో అర్హులైన గుర్తింపు సాంస్కృతిక కళాకారుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఏలూరు జిల్లా సమాచార, పౌర సంబంధాల అధికారి ఆర్‌విఎస్.రామచంద్రరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని సాంస్కృతిక కళాకారులు గుర్తింపు కార్డుల జారీ నిమిత్తం ఈ నెల ఏడో తేదీలోపు తమ వివరాలను ఏలూరు జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయానికి పంపాలని సూచించారు. కళాకారులు తమ పేరు, తండ్రి పేరు, పుట్టిన తేదీ, బ్లడ్ గ్రూప్, కళారూపం, కళారూపంలో ఎన్ని సంవత్సరాలు అనుభవం, ఆధార్ నెంబర్, పూర్తి అడ్రస్, సెల్ నెంబర్, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, ఇ-మెయిల్ అడ్రస్, ఎ4 సైజు కాగితంపై స్పష్టంగా నింపి, ఆధార్, కళారూపాల ప్రదర్శన జిరాక్స్ కాపీలు దరఖాస్తుతో కలిపి జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ, ప్రభుత్వాసుపత్రి గేటుపక్కన, ఏలూరు జిల్లా చిరునామాకు పంపాలని ఆయన తెలిపారు.

గంధం నరేంద్రకు నివాళులర్పిస్తూ కొవ్వొత్తుల ర్యాలీ

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

గణేష్ నిమజ్జన కార్యక్రమంలో అశువులు బాసిన ఆగిరిపల్లి కానిస్టేబుల్ గంధం నరేంద్రకు సంఘీభావంగా ఆగిరిపల్లి పురవీధుల్లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ పోలీస్‌స్టేషన్ నుంచి పెద్ద కొఠాయి సెంటర్ వరకు సాగింది. ఈ సంఘీభావ ర్యాలీలో నూజివీడు డిఎస్‌పి ఇ.అశోక్‌కుమార్ గౌడ్, నూజివీడు రూరల్ సిఐ బాల సురేష్‌బాబు, ఆగిరిపల్లి ఎస్ఐ చంటిబాబు పాల్గొన్నారు.

'ప్రజామనిషి డిఎన్ఆర్'

మండవల్లి : నిత్యం ప్రజలతో ఉంటూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సత్వర పరిష్కారం చూపిస్తున్న ఏకైక నాయకుడు కైకలూరు ఎంఎల్ఎ దూలం నాగేశ్వరావు అని అంబేద్కర్ అసోసియేషన్ అధ్యక్షులు ఎల్ఎస్ భాస్కరరావు స్పష్టం చేశారు. ఆయన నివాసంలో గురువారం మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజల చిరకాల వాంఛ అంబేద్కర్ భవనాన్ని నిర్మించడమేనని అన్నారు. అయితే గాంధీ జయంతి నాడు గాంధీ సేవా ఆశ్రయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో కైకలూరులో అంబేద్కర్ భవనాన్ని నిర్మించడానికి చర్యలు చేపట్టానని ఆయన సభా ముఖంగా చెప్పి మరోసారి ఆయనకు ఉన్న సహృదయాన్ని చాటుకున్నారన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎకు కృతజ్ఞతలు తెలిపారు.

వ్యక్తిని కోల్పోవడం బాధాకరం

మండవల్లి : కుటుంబంలోని వ్యక్తిని కోల్పోవడం అనేది ఎంతో బాధాకరమని కైకలూరు నియోజకవర్గ ఎంఎల్ఎ దూలం నాగేశ్వరావు తెలిపారు. గన్నవరంలో మంగళవారం నిర్వహించిన కీర్తిశేషులు మెండ ఎలీషా ప్రథమ వర్ధంతి కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులువెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రూ.47 లక్షలతో అదనపు తరగతి గదుల నిర్మాణం

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

పట్టణ పరిధిలోని ఎస్ఆర్ఆర్ బాయ్స్ హైస్కూల్ ఆవరణలో నాడు - నేడు సెకండ్ పేజీలో రూ.47 లక్షలు మంజూరైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డాక్టర్ భాగవతుల హేమలత తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల సామర్థ్యానికి తగినట్లు అదనపు తరగతి గదుల నిర్మాణం కొనసాగుతుందన్నారు. భవన నిర్మాణం మంజూరు పట్ల ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

వాలంటీర్ ఔదార్యం

ఉంగుటూరు: గొల్లగూడేనికి చెందిన పెద్దింటి మార్రెడ్డి అనారోగ్యంతో తూర్పుగోదావరి జిల్లా పిఠాపురంలో కుమార్తె ఇంటి వద్ద చికిత్స పొందుతున్నాడు. అతనికి వృద్ధాప్యం పింఛన్ సొమ్మును సంబంధిత వాలంటీర్ నిట్టా ప్రసన్న పిఠాపురం వెళ్లి అందజేశారు. సామాజిక పింఛన్‌ను సకాలంలో లబ్ధిదారులకు అందివ్వాలనే లక్ష్యంతో సుమారు 150 కిమీ దూరం వెళ్లి, సొమ్ము అందించిన వాలంటీర్‌ను పంచాయతీ కార్యదర్శి యాళ్ల కిషోర్‌బాబు, విఆర్ఒ చంద్రబాబు అభినందించారు.

నిలిచిన స్టేడియం నిర్మాణ పనులు

భీమడోలు : శాప్(స్పోర్ట్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్) ఆధ్వర్యంలో జిల్లా పరిధిలో చేపట్టిన స్పోర్ట్స్ ఇండోర్ స్టేడియంల నిర్మాణాలు నిలిచిపోయాయి. దీనికి ప్రధాన కారణం సకాలంలో బిల్లులు రాకపోవడంతో గుత్తేదారులు పనులు నిలిపివేశారు. వివరాలలోకి వెళితే 2016-17 ఆర్థిక సంవత్సరంలో జిల్లా పరిధిలో 18 ఇండోర్ స్టేడియంల నిర్మాణాలకు రూ.36 కోట్ల నిధులు మంజూరయ్యాయి. నిర్మాణ పనుల పర్యవేక్షణా బాధ్యతను గృహ నిర్మాణ సంస్థ స్వీకరించింది. ఈ నేపథ్యంలో జిల్లాకు మంజూరైన 18 ఇండోర్ స్టేడియల నిర్మాణాలలో 15 నిర్మాణాలు ప్రారంభమైయ్యాయి. ఇదేక్రమంలో భీమడోలు హైస్కూల్ ఆవరణలో ఇండోర్ స్టేడియం నిర్మాణ పనులను గుత్తేదారులు ప్రారంభించారు. సుమారు రూ.70 లక్షల విలువ గల పనులను పూర్తి చేశారు. ఆ తర్వాత బిల్లులు సంవత్సర కాలంగా మంజూరు కాకపోవటంతో పనులను నిలిపివేశారు. ఎట్టకేలకు ప్రస్తుత సంవత్సరం పెండింగ్ ఉన్న బిల్లులు విడుదలయ్యాయి. వాటిని తీసుకున్న గుత్తేదారుల మాకు ఉన్న ఇబ్బందులు దృష్ట్యా ఇకపై మేము పనులు చేయలేమని అధికారులకు స్పష్టం చేశారు. దీంతో ఇండోర్ స్టేడియం పనులు నిలిచిపోయాయి. ఈ విషయమై గృహ నిర్మాణ సంస్థ ఉంగుటూరు డిఇని వివరణ కోరగా గుత్తేదారులు 2016-17 ఆర్థిక సంవత్సరం ధరలతో నిర్మాణాలు చేపట్టలేమని స్పష్టం చేస్తూ రాత పూర్వకంగా తెలియజేశారన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లామని వారు తెలిపారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి ఇండోర్ స్టేడియంల నిర్మాణాలు ప్రారంభమయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని క్రీడా అభిమానులు కోరుతున్నారు.

రేషన్ బియ్యం పంపిణీపై విజిలెన్స్ తనిఖీలు

జంగారెడ్డిగూడెం : పట్టణంలో రేషన్ బియ్యం సరఫరా చేస్తున్న ఎండియా వాహనాలలో విజిలెన్స్ అధికారులు ఆకస్మిక తనిఖీ చేశారు. మంగళవారం విజిలెన్స్ ఎస్ఐ రంజిత్ కుమార్ ఆధ్వర్యంలో పట్టణంలోని 4వ నెంబర్ రేషన్ షాపు, 22, 17 నెంబర్ల ఎమ్‌డియు వాహనాలలో సరఫరా చేస్తున్న రేషన్ బియ్యం, పంచదారపై తనిఖీ చేశారు. ఈ నేపథ్యంలో రేషన్ బియ్యం సరఫరాలో ఎన్‌డియు నెం-17 వాహనంలో రూ .1,661, ఎమ్‌డియు-22 వాహనంలో రూ.1,043లు వ్యత్యాసం గుర్తించినట్టు తెలిపారు. అలాగే నాలుగవ నెంబర్ రేషన్ దుకాణంలో బియ్యం, పంచదార, గోధుమపిండి అసలుకు మించి అధిక నిల్వ ఉన్నట్లు తెలిపారు. దీంతో ముగ్గురు నిర్వాహకులపై సిక్స్ ఎ కేసు నమోదు చేశామని తెలిపారు. ఈ తనిఖీలలో విజిలెన్స్ ఎఒ శ్రీనివాస్, సిఎస్‌డిటి వైవి.లక్ష్మి కుమారి పాల్గొన్నారు.

యోగా పోటీలకు ఎంపికలు

నూజివీడు రూరల్: నూజివీడు ట్రిపుల్ ఐటీ యోగాశాలలో మంగళవారం ఉమ్మడి కృష్ణాజిల్లా అండర్-19 బాల బాలికల యోగా జట్ల ఎంపిక పోటీలు నిర్వహించారు. ట్రెడిషనల్, ఆర్టిస్టిక్, రిథమిక్ విభాగాలలో ఎంపిక చేశారు. ట్రెడిషనల్‌లో నూజివీడు ట్రిపుల్ ఐటీకి చెందిన టి.దుర్గాప్రసాద్, టి.అభిషేక్, కె.జస్వంత్, ఎ.జబ్బురా, జి.చంగయ్య, స్టాండ్ బైలుగా సిహెచ్.దీపక్ నాయుడు, పి.షణ్ముఖ వికాస్ ఎంపికయ్యారు. బాలికల విభాగంలో ఎం.బృందా(మేరీ స్టెల్లా కళాశాల విజయవాడ), నూజివీడు ట్రిపుల్ ఐటీ నుంచి పి.మేఘన, ఎన్.అక్షర ప్రియ, జె.హేమ విశాలి సాయి దుర్గ, బి.ఉదయిక, స్టాండ్ బైలుగా టి.తనుజ, ఎ.లక్ష్మీ ప్రవీణ్ ఎంపికయ్యారు. ఆర్టిస్ట్ విభాగంలో అభిషేక్, బాలికల నుంచి పి.మేఘన(నూజివీడు ట్రిపుల్ ఐటీ) రిథమిక్ విభాగంలో బాలురు నుంచి టి.దుర్గాప్రసాద్, బాలికల నుంచి జి.స్వర్ణలత (నూజివీడు ట్రిపుల్ ఐటీ) ఎంపికయ్యారు. వీరు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని ట్రిపుల్ ఐటీ యోగా శిక్షకుడు అక్కినేని శ్రీధర్ తెలిపారు.

800 మందికి అన్నదానం

జంగారెడ్డిగూడెం: మండలంలోని గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి ఆలయంలో 800 మంది యాత్రికులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించామని ఆలయ కార్య నిర్వహణ అధికారి ఎ.కొండలరావు తెలిపారు. మంగళవారం ఆలయానికి అధిక సంఖ్యలో యాత్రికులు తరలివచ్చారు. ఈ నేపథ్యంలో రూ.1,19,334లు ఒక్కరోజు ఆదాయం సమకూరిందని తెలిపారు. యాత్రికులకు అసౌకర్యం కలగకుండా సేవలందించారని ఆయన తెలిపారు.

భూ వివాదంలో కేసు నమోదు

జీలుగుమిల్లి: పాములవారిగూడెంలో వ్యవసాయ భూమి తగాదా విషయంలో మంగళవారం ఇరు వర్గాల వారిపై రెండు కేసులు నమోదు చేసినట్టు హెడ్ కానిస్టేబుల్ నాగేశ్వరరావు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పాములవారిగూడెంలోని పలు సర్వే నంబర్‌లలో సుమారు 7 ఎకరాల భూమి విషయంలో. కుంజా తులసి, రవి కుమార్, నూపా దుర్గారావు వారి కుటుంబాల మధ్య గత కొంతకాలంగా భూ వివాదం జరుగుతున్నట్లు తెలిపారు. ఆ సమస్య కోర్టులో పెండింగ్‌లో ఉండగా మరల దుర్భశ లాడుతూ గొడవ పడ్డ ఘటనలో ఇరు వర్గాలకు చెందిన పలువురిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.